

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## గాడ్ ఫియర్

**"రామా.. నిద్రలేవరా.** పొద్దున్నే లేచి తూర్పు తిరిగి దణ్ణం పెట్టుకుంటే రోజంతా చక్కగా గడుస్తుంది. నీ భాషలో చెప్పాలంటే 'డి' విటమిన్ పుష్కలంగా దొరుకుతుంది" తాతయ్య అరిచాడు.

"ప్లీజ్ తాతా. ఒక్క అరగంట" రమేష్ దుప్పట్లోంచి తల బయటపెట్టకుండానే వేడుకున్నాడు.

అరగంట తర్వాత తాతయ్య మరోసారి అరిచేసరికి రమేష్ అయిష్టంగానే లేచి మొహం కడుక్కుని వంటగదిలోకి వచ్చాడు.

"తాత ప్రశాంతంగా పడుకోనీడం లేదమ్మా" పాలగ్లాస్ అందించిన తల్లితో మొరపెట్టుకున్నాడు.

సుజాత చిన్నగా నవ్వింది.

"ఆయనేమైనా కాని పని చేయమంటే వెళ్ళి పోట్లాడతా. తాతయ్య మంచి మాటలే చెప్పారు కదరా?"

"ఒక్క గంట ఎక్స్‌ట్రా పడుకుంటే ఏమౌతుంది? ఇవాళ సండేనేకదా?" రమేష్ గొణిగాడు.

"రామా - ఇలారా" తాతయ్య పిలుపు వినిపించింది.

"వస్తున్నా" రమేష్ పాలు ఒక్క గుక్కలో తాగి, గ్లాస్ తల్లి చేతికిచ్చి తాతయ్య దగ్గరకి వెళ్ళాడు.

ఆయన వరండాలో పడక కుర్చీలో కూర్చుని ఉన్నాడు. పక్కనే టీపాయ్ మీద తెలుగు, ఇంగ్లీష్ న్యూస్ పేపర్స్ ఉన్నాయి.

రమేష్ వినయంగా మోకాళ్ళమీద కూర్చుని తాతయ్య కాళ్ళు మృదువుగా నొక్కుతూ అడిగాడు.

"గుడ్మార్నింగ్ తాతా ఎందుకు పిలిచావు?"

ఆయన మనవడి బుగ్గలు ఆప్యాయంగా తడుతూ చెప్పాడు

"ఇవాళ రథసప్తమి. స్నానం చేసి సూర్యభగవానుడికి దణ్ణం పెట్టుకో. సూర్యుడు నమస్కార ప్రియుడు."

"నీకు కల్లోకి వచ్చి చెప్పాడా తాతా? నువ్వు ఏమి చెప్పినా వింటాకాని దేవుడు, దయ్యంలాంటివి చెపితే మాత్రం వినను. నేను ఎథీస్ట్‌ని" రమేష్ చెప్పాడు.

"సూర్యుడు ప్రత్యక్ష దైవంరా నాన్నా. ఆయన లేకపోతే మనం లేం. మరి మనం కృతజ్ఞతలు చెప్పుకోవద్దూ?"

"ఏమో తాతా. నాకు నమ్మకం లేదు. దేవుడి విషయంలో నన్ను వదిలెయ్" రమేష్ చేతులు జోడించాడు.

"దేవుడున్నాడని నమ్మితే 'గాడ్ ఫియర్' ఉంటుంది. తప్పు చేస్తే దేవుడు శిక్షిస్తాడు అనే పాపభీతి ఉంటుంది. అందుకని దేవుడ్ని నమ్మమంటున్నాను. పూజలు, పునస్కారాలు చేయమనడంలేదుగా? దేవుడ్ని నమ్మితే నష్టం లేదుగా నాన్నా."

"ప్లీజ్ తాతయ్యా. నా అభిప్రాయం నాది" రమేష్ లేచి లోపలికి వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం రమేష్ స్నేహితులు నలుగురు వచ్చారు. వాళ్ళు రమేష్‌ని గదిలోకి లాక్కెళ్ళి గుసగుసగా చెప్పారు.

"ఒరేయ్. మహేష్‌బాబు సినిమా ఆడియో రిలీజ్ ఫంక్షన్‌కి పాస్‌లు దొరికాయి వెళ్దాం వస్తావా?"

రమేష్ మొహం వికసించింది.

"ఉండండి. అమ్మ నడిగి చెప్తా. తాత నిద్రపోతున్నాడు. గొడవ చేయకండి" చెప్పి టి.వి చూస్తున్న తల్లి పక్కకి చేరాడు.

"అమ్మా. నాన్నేరి?" అడిగాడు.

"సుబ్రమణ్యం అంకుల్ ఇంటికి వెళ్ళారు. ఏం?"

"అమ్మా మహేష్ బాబు సినిమా ఆడియో రిలీజ్ అట. పాస్‌లు దొరికాయ్ వెళ్ళనా?"

"అమ్మో! బాగా రష్‌గా ఉంటుంది నాన్నా. లాఠీఛార్జ్ కూడా చేస్తారు ఒక్కోసారి. వద్దు" సుజాత ఒప్పుకోలేదు.

"చిన్నపిల్లాడ్నా అమ్మా. మరీ చెప్తావు. నాకు పద్దెనిమిదేళ్ళు" రమేష్ విసుక్కున్నాడు.

సుజాత నవ్వింది.

"సరే. ఫోన్‌కి ఛార్జ్ ఉందా? నేనెప్పుడు కాల్ చేసినా ఆన్సర్ చేయాలి. లేకపోతే ఇంక ఎక్కడికీ పంపించను" చెప్పింది.

రమేష్ హుషారుగా గదిలోకి వచ్చి డ్రెస్ మార్చుకుని పెర్‌ఫ్యూమ్ స్ప్రే చేసుకుని మిత్రబృందంతో బయటకి నడిచాడు.

ఫంక్షన్ హాల్ లోపల ఎంత మందున్నారో బయట అంతకు రెండింతలు జనం ఉన్నారు. పాస్‌లు చూపించి మొత్తానికి లోపలకి వెళ్ళి స్టేజ్ బాగా కనపడే కుర్చీల్లో కూర్చుని అమ్మయ్య అనుకున్నారు.

రమేష్ చెదిరిన క్రాఫ్‌ని సర్దుకుని ఓసారి హాలంతా కలయచూసాడు. తమకి ఎడమవైపు వరసలో రెండు వరసల వెనక కూర్చున్న తండ్రి కనపడటంతో గతుక్కుమన్నాడు. ఆయన పక్కనే ఉన్న సుబ్రమణ్యం అంకుల్‌తో ఏదో మాట్లాడుతున్నాడు. రమేష్ వెంటనే తల తిప్పుకున్నాడు. చాలామంది తండ్రుల్లా రమేష్ తండ్రి గంభీరంగా పిల్లలకి సింహస్వప్నంగా ఉంటాడు. చాలామంది పిల్లల్లా రమేష్ అమ్మ కూచి తప్ప తండ్రంటే భయపడతాడు.

'ఛ. నాన్న కూడా రావాలా?' అనుకున్నాడు. అతను నిరాశలో మునిగిపోయాడు. ఫ్రెండ్స్ అతనిలోని మార్పుని గుర్తించలేదు. లోపలకి వస్తున్న సెలబ్రిటీలని చూసి పెద్దగా అరుస్తూ గొడవచేస్తున్నారు.

రమేష్ వాళ్ళని చూసి కుళ్ళుకున్నాడు. నాన్న రాకపోతే తనూ ఇంకాస్త ఎక్కువ అల్లరి చేసేవాడు.

రమేష్ నిశ్శబ్దంగా సీట్లో వెనక్కి కూర్చుని ఆ సంరంభాన్ని గమనించసాగాడు. ఫంక్షన్ ఆద్యంతం అతను బుద్ధిగా కూర్చుని తాతయ్య టి.విలో రామాయణం చూసినట్లుగా చూసాడు.

తర్వాత నిస్పృహగా ఇంటికి చేరుకున్నాడు.

"ఏం నాన్నా అలా ఉన్నావు? కొంపదీసి ఫోన్ పోలేదు కదా?" సుజాత ఆదుర్దాగా అడిగింది.

"లేదమ్మా పోలేదు. ఉంది. కొంచెం తలనొప్పిగా ఉందమ్మా. అన్నం పెడితే తినేసి పడుకుంటా" రమేష్ కోరాడు.

"సరే. సరే. రా. ఆడియో ఫంక్షన్ అన్నావుగా సౌండ్ ఎక్కువగా ఉందేమో" సుజాత వాడి నుదుటిమీద తాకి చూసి చెప్పింది.

"జ్వరం లేదులే. పద. నాన్న కూడా ఇంకా రాలేదు. ఎప్పుడొస్తారో. నువ్వు తినెయ్" సుజాత వంటగదిలోకి నడిచింది.

గబగబ అన్నం తినేసి రమేష్ తన గదిలోకి వెళ్ళి తలుపు మూసాడు. దుప్పటి కప్పుకుని కళ్ళు మూసుకుంటే, కళ్ళముందు తారలు కదిలారు.

'ఎంత బాగున్నారంతా? ముట్టుకుంటే మాసిపోయేట్లున్నారు. హీరోయిన్ నవ్వు ఎంత బాగుందో. ఆమె మాట్లాడుతున్నంతసేపు ఫ్రెండ్స్ ఈలలు వేస్తూనే ఉన్నారు. హీరో ఉపన్యాసానికి చప్పట్లు మోగిపోయాయి. కానీ తనే బుద్ధిగా క్లాస్ రూంలో కూర్చున్నట్లు కూర్చున్నాడు. నాన్నంతటి నాన్న ఇలాంటి ఫంక్షన్స్‌కి రారు. ఆ సుబ్రమణ్యం అంకులే.." మనసులోనే ఆయన్ని తిట్టుకున్నాడు.

మళ్ళీ ఇంతమంచి అవకాశం ఎప్పటికొచ్చేనూ? అలసిపోయిన రమేష్ నిద్రలోకి జారుకున్నాడు.

"రామా! కాలేజ్ లేదూ? సూర్యనారాయణుడు వచ్చేసాడు" తాతయ్య పిలుపుకి మెలుకువ వచ్చి బద్దకంగా లేచి మొహం కడుక్కుని బయటకి వెళ్ళాడు.

పాలగ్లాస్‌తో తాతయ్య దగ్గరకి వెళ్ళి వంగి ఆయన్ని ముద్దుపెట్టుకుని చెప్పాడు.

"గుడ్మార్నింగ్ తాతా."

ఆయన ఆప్యాయంగా వాడి జుట్టు నిమిరి చెప్పారు.

"సూర్యుడికి నమస్కారం చెయ్యరా. ఆయన లోక బాంధవుడు. కర్మసాక్షి."

రమేష్ నవ్వేసాడు.

"సాయంత్రం లేట్‌గా వస్తా తాతా. ఫిజిక్స్ సర్ ఎక్స్‌ట్రా క్లాస్ తీసుకుంటానన్నారు" చెప్పాడు.

"సరే సరే. బాగా చదువుకో" ఆయన మనవడి వైపు ప్రేమగా చూస్తూ చెప్పాడు.

సాయంత్రం కాలేజ్ నించి వచ్చిన రమేష్ తాతయ్య దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

"వచ్చేసా తాతయ్యా. ఫైవ్ మినిట్స్‌లో ఫ్రెష్ అవుతా"

"త్వరగా కానీ. మీ అమ్మ నీకేదో శుభవార్త చెప్పాలిట."

ఆయన నవ్వి చెప్పాడు.

"శుభవార్తా?... అమ్మా... అమ్మా.."

రమేష్ తల్లి దగ్గరకి వెళ్ళి అడిగాడు.

"ఏంటా గుడ్ న్యూస్?"

ఆరిన బట్టలు మడతలు పెడుతున్న సుజాత నవ్వి చెప్పింది.

"అంత ఆత్రమెందుకు? స్నానం చేసిరా పో"

"ప్లీజమ్మా. చెప్పవా?" బతిమాలాడు.

"నిన్న నువ్వు వెళ్ళిన ఫంక్షన్‌కే నాన్న కూడా వెళ్ళారు" చెప్పింది.

"ఓ! అవునా?" అమాయకత్వం నటించాడు.

"నువ్వు ఆయన్ని గమనించలేదు కాని, ఆయన నిన్ను చూసారు. రాత్రి నాన్న ఇంటికి వచ్చేసరికి లేటైంది. భోజనం చేస్తూ నిన్ను ఒకటే మెచ్చుకున్నారు."

"నన్నా? ఎందుకమ్మా?" కుతూహలంగా అడిగాడు.

"నీ ఫ్రెండ్స్ రౌడీ వెధవల్లా ఈలలు, చప్పట్లు, అరుపులతో నానాగోల చేసారట. నువ్వు మాత్రం బుద్ధిగా కదలకుండా డిగ్నిఫైడ్‌గా ఉన్నావుట."

రమేష్ సిగ్గుపడ్డాడు. నాన్నని చూడకపోతే తనూ అలాగే చేసేవాడు.

"నాన్న నన్ను మెచ్చుకున్నారన్నమాట. వెరీ హేపీ. స్నానం చేసి వస్తా" చెప్పాడు.

"మరి గుడ్ న్యూస్ వినవా?"

"ఇంకో న్యూస్ కూడా ఉందా? ఏమిటది? ఆసక్తిగా అడిగాడు.

"పొద్దున చెప్పారు. నువ్వు అల్లరి చిల్లరగా" ఉంటావని నువ్వు ఎంత బతిమాలినా బైక్ కొనివ్వలేదట. కానీ రాత్రి నీ ప్రవర్తన చూసాక బాగానే డ్రైవ్ చేస్తావని నమ్మకం వచ్చిందిట. సాయంత్రం రాగానే నిన్ను తీసుకెళ్ళి నీకు నచ్చిన బైక్ కొనిస్తారట" సుజాత చెప్పింది.

"అమ్మా! నిజంగా?" రమేష్ కళ్ళు మెరిసాయి.

"అవును. త్వరగా తయారవు. ఏ బండి మంచిదో నీ ఫ్రెండ్స్‌తో కూడా మాట్లాడు" సుజాత చెప్పింది.

రమేష్‌కి అప్రయత్నంగా కన్నీళ్ళు వచ్చాయి. అవి తల్లికి కనబడకుండా తన గదిలోకి నడిచాడు. నాన్న చూస్తున్నాడని తెలియగానే తను బుద్ధిమంతుడిలా బిహేవ్ చేసాడు. లేకపోతే మామూలు అల్లరికాదు తనది.

అకస్మాత్తుగా రమేష్‌కి తాతయ్య మాటలు గుర్తొచ్చాయి.

"గాడ్ ఫియర్'

నిజమే నాన్న చూస్తున్నాడని బుద్ధిగా ఉన్నందుకు ఫలితం బైక్ రూపంలో వస్తోంది. అలా 'దేవుడు చూస్తున్నాడు' అనే భయంతో ఉంటే, మనిషి తప్పు చేయగలడా? దేవుడు లేడని నమ్మే అరాచకం కన్నాణ ఉన్నాడని నమ్మే భయం మంచిదేమో.

"రామా! తెల్లారిందిరా. సూర్యభగవానుడు వచ్చేసాడు" తాతయ్య ఎప్పటిలా మేలుకొలుపు పాడాడు.

"వస్తున్నా తాతయ్యా."

అప్పటికే స్నానం చేసిన రమేష్ తూర్పువైపు తిరిగి సూర్యబింబానికి నమస్కారం చేసాడు.
"ఎథీస్ట్ ఏమిటి ఇవాళ విచిత్రంగా?" తాతయ్య ఆశ్చర్యపోయాడు.
"నేనిప్పుడు ఆస్తికుడ్ని తాతా. సూర్యుడు కర్మసాక్షి అన్నావుగా? నేను చేసేదంతా చూస్తాడు కదా?" అడిగాడు.
"అవునా" ఆయన భక్తిగా చెప్పాడు.
రమేష్ తాతయ్యని ముద్దుపెట్టుకుని చెప్పాడు.
"నీ మీద నాకెంత ప్రేమో సూర్యుడు చూసేసాడు తాతా"

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments